
అలంకార ప్రాయంగా
సులభ్ కాంప్లెక్స్‌లు
● హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.22 లక్షలతో నిర్మాణం
● ఒప్పందం రెన్యూవల్‌పై అధికారుల నిర్లక్ష్యం
8



నేడు సంగారెడ్డి రామ్‌మందిర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

జగ్గారెడ్డి కూతురు నిశ్చితార్థానికి హాజరవుతున్న సీఎం, టీపీసీసీ చీఫ్ మహేశ్, కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు

సంగారెడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి రాంనగర్ రామ్‌మందిర్ వద్ద నేడు సాయంత్రం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి, గుణచైతన్యరెడ్డిల నిశ్చితార్థ వేడుక జరగనున్నది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారు. ముందుగా సీఎం రామ్‌మందిర్‌లో సీతారాములను దర్శనం చేసుకుంటారు. అనంతరం కాబోయే వధూవరులను ఆశీర్వదిస్తారు. ఈ మేరకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.



నిప్పుల కొలిమి

● ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండో రోజూ అత్యధిక ఉష్ణోగ్రతలు
● 98 ప్రాంతాల్లో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు

కోహీర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ ఎండల తీవ్రత పెరుగుతున్నది. మంగళవారం మరో రెండు డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడంతో తీవ్రత మరింత పెరిగింది. మెదక్ జిల్లా పోడ్చన్‌పల్లిలో 42.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా.. సిద్దిపేట జిల్లాలో రాఘవాపురంలో 42.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కడ్పల్‌లో 42.4, డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 98 గ్రామాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవి తీవ్రతకు మధ్యాహ్నం రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందిపడ్డారు. ఉపాధిహామీ కూలీలు ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకొని ఇంటికి చేరుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రత వివరాలు..

సిద్దిపేట జిల్లా రాఘవపూర్‌లో 42.2 డిగ్రీలు, బెజ్జంకి 42.5, పోతరెడ్డిపెట 42.3, రాంపూర్ 42.2, పెద్దకోడూరు 42.2, తుక్కాపూర్ 42.1, కోహెడ 42.1, వెంకటరావుపేట 42.0, నారాయణరావుపేట 41.9, చిట్యాల 41.9, శనిగరం 41.8 మిరుదొడ్డి 41.6, గౌరారం 41.6 చీకోడ్ 41.5, అక్బీపూర్ 41.5, రేబర్తి 41.5, కొండపాక 41.5, ముస్త్యాల 41.3, కొమురవెల్లి 41.2, హుస్నాబాద్ 41.2, కట్కూర్ 41.0 మునిగడప 41.0, సముద్రాల 41, తిప్పారం 41, సిద్దిపేట 40.8, దౌల్తాబాద్ 40.8, దూళ్మిట్ట 40.5, గజ్వేల్ 40.4, నంగనూరు 40.3, కొడకండ్ల 40.3, బెజుగావ్ 40.1 లక్దారం 40 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లా పొడ్చన్‌పల్లిలో 42.8 డిగ్రీలు, కొడిపల్లి 42.7, వడ్డీ 42.6, దామరంచ 42.5, శంకరంపేట(ఆర్) 42.4, నాగపూర్ 42.4, చిట్కుల్ 42.4, పాతూర్ 42.3, కొల్చారం 42.2, సర్దన 42.2, బుజరంపేట 42.1, రాజ్‌పల్లి 42.1, మాసాయిపేట 41.9, చేగుంట 41.8, వెల్దుర్తి 41.6, అల్లాదుర్గం 41.6, నర్సాపూర్ 41.6, మెదక్ 42.6, శివ్వంపేట 41.1, రామాయంపేట 41.1, కాగజ్‌మద్దూర్ 41.1, కొత్తపేట 41.1, రేగోడు 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లా కడ్పల్‌లో 42.4 డిగ్రీలు, వట్‌పల్లి 41.9, సిర్గాపూర్ 41.9, దిగ్వాల్ 41.8, పాల్‌వట్ల 41.8, పుల్కల్ 41.7, చౌటకూర్ 41.7, నారాయణఖేడ్ 41.7, జిన్నారం 41.6 రాయికోడ్ 41.5, కల్హేర్ 41.5, కంగ్టి 41.4, లక్ష్మీసాగర్ 41.1 మల్‌చెల్మ 41.1, అల్గోల్ 41.0, సత్వార్ 41.0, నిజాంపేట్ 41, సంగారెడ్డి 40.1, సదాశివపేట 40, పాశమైలారం 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మంత్రి పొన్నం చొరవతో.. దుబాయ్ నుంచి ఇండియాకు



లింగయ్య

హుస్నాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి ఇబ్బందులు పడుతున్న హుస్నాబాద్‌కు చెందిన చొప్పరి లింగయ్య రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఇంటికి రాబోతున్నారు. నెల క్రితం దుబాయ్ వెళ్లిన లింగయ్య తన ఆరోగ్యం క్షీణించిందని, కాళ్ల వాపులతో నడవలేకపోతున్నానని, తిరిగి వెళ్లడానికి వీలులేకుండా కంపెనీ వారు పాస్‌పోర్టు తీసుకున్నారని సెల్ఫీ వీడియో తీసి పంపించారు. తనను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ స్వదేశానికి తీసుకెళ్లాలని అభ్యర్థించాడు. పత్రికల్లో అతని గురించి వార్తా కథనాలు ప్రచురితమవడం, ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి దుబాయ్‌లోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాలరాజు గౌడ్‌కు సమాచారమిచ్చారు. లింగయ్యను హుస్నాబాద్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయన దుబాయ్‌లో లింగయ్య వద్దకు వెళ్లారు. కంపెనీ యజమాన్యంతో మాట్లాడి విమాన ఛార్జీలు కూడా చెల్లించి ఇండియాకు పంపిస్తామని, ఎలాంటి దిగులు చెందొద్దని భరోసా ఇచ్చారు. మంత్రి ప్రభాకర్ సూచన మేరకు ఇంటికి పంపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హుస్నాబాద్‌లోని లింగయ్య కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

చేర్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో మంగళవారం సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాట లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల య పరిధిలోని రాతిగీరల వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాప్ నంబర్25కు రూ.10,300 హెచ్చుపాట రావడంతో జి.మల్లేశానికి, అన్నదాన సత్రం షాపింగ్ కాంప్లెక్స్ షాప్ నంబర్-5కు రూ.5,650 చొప్పున టి.అనురాధకు ఖరారు చేశారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డు నియామకానికి సంబంధించి రూ.15,500 చొప్పున తక్కువ కోట్ చేసిన ఆరోహి సర్వీసెస్ వారికి టెండర్ ఖరారు చేసినట్లు ఈవో అన్నపూర్ణ తెలిపారు.

అట్టడుగులో..

ఇంటర్‌లో చేదు ఫలితాలు

● ప్రథమ సంవత్సరంలో 30.. ద్వితీయ సంవత్సరంలో 31వ స్థానం
● ఏటా పడిపోతున్న జిల్లా ర్యాంకు
● సగానికి సగం ఫెయిలవుతున్న విద్యార్థులు
● ప్రభుత్వ కాలేజీల్లో దారుణ ఫలితాలు
● ముందస్తు పర్యవేక్షణ లేకనే ఈ పరిస్థితా..!



విజయ సంకేతం చూపిస్తున్న సిద్దిపేటలోని మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజ్ విద్యార్థినులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 22: ఇంటర్ ఫలితాల్లో మరోసారి జిల్లా ర్యాంకు అట్టడుగుస్థాయికి పడిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఫస్ట్ ఇయర్‌లో 30వ స్థానం, సెకండ్ ఇయర్‌లో 31వ స్థానం దక్కింది. గతేడాది 25వ స్థానంలో ఉన్న జిల్లా మరింత కిందికి చేరడం గమనార్హం. పరీక్ష రాసిన విద్యార్థుల్లో ఇంచుమించు సగం మంది ఫెయిలయ్యారు. రెండేళ్ల క్రితం మెరుగ్గా ఉన్న జిల్లా ర్యాంకు క్రమంగా దిగజారడం ఆందోళనను కలిగిస్తోంది. గతేడాది ఫలితాలను సమీక్షించుకుని మరింతగా పర్యవేక్షించకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పదోతరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో ఉంటున్న సిద్దిపేట జిల్లా ఇంటర్ ఫలితాలకు వచ్చేసరికి అట్టడుగు స్థానానికి పడిపోతుంది. ఈ విషయంపై గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టి కాస్త మెరుగైన స్థానానికే తెచ్చారు. కానీ తాజా ఫలితాల్లో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో 33 జిల్లాలుంటే ఇందులో చివరి 3 స్థానాల్లో జిల్లా ఫలితాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో 25 ప్రైవేట్, 20 ప్రభుత్వ కళాశాలలతోపాటు కస్తూర్బా, గురుకులాలు, మోడల్ స్కూళ్లు కలిపి 55 ఉన్నాయి.

బాలురను మించిన బాలికలు..

ఇంటర్ ఫలితాల్లో బాలుర ఉత్తీర్ణత కేవలం 38 శాతమే ఉంది. బాలికలు మాత్రం 63.33 శాతం పాసయ్యారు. దాదాపు 25 శాతం ఉత్తీర్ణత ఎక్కువగా సాధించడం విశేషం. ఫస్టియర్‌లో బాలురు 38 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలికలు 61.30 శాతం, సెకండియర్‌లో బాలురు 47.05 శాతం

మిగతా 8లో..

ప్రథమ సంవత్సరం ఫలితాలు

పరీక్షరాసినవారు	పాసైనవారు	శాతం
7,170	3,682	51.35
ఒకేషనల్		
2,621	1,360	52.00

ద్వితీయ సంవత్సరం ఫలితాలు

పరీక్షరాసినవారు	పాసైనవారు	శాతం
6,983	4,140	59.29
ఒకేషనల్		
2,234	1,350	60.43

ఆ కాలేజీలో 55 మందిలో ఇద్దరే పాస్..

మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 55 మంది విద్యార్థులు ఫస్ట్‌ఇయర్ పరీక్షలు రాయగా కేవలం ఇద్దరే పాసయ్యారు. బెజ్జంకిలో 70 మందికి కేవలం 8 మంది, హుస్నాబాద్ ప్రభుత్వ కాలేజీలో 93 మందికి 8 మంది, జగదేవ్‌పూర్ కాలేజీలో 110 మందికి కేవలం 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చిన్నకోడూరు, గజ్వేల్, తొగుట, సిద్దిపేట బాలికలు, దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఓ రకంగా మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఇక సెకండ్ ఇయర్ ఫలితాల విషయానికొస్తే మిరుదొడ్డి ప్రభుత్వ కాలేజీలో 61 మందికి కేవలం ముగ్గురే పాసయ్యారు. హుస్నాబాద్, జగదేవ్‌పూర్, కొండాపాక, చేర్యాల, నంగునూరు, బెజ్జంకి, దుబ్బాక ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు తీవ్రంగా నిరాశపరిచారు. దౌల్తాబాద్, ములుగు, చిన్నకోడూరు, హుస్నాబాద్ బాలికలు, కోహెడ, వర్గల్ ప్రభుత్వ కాలేజీల్లో పర్వాలేదు.

ప్రభుత్వ కళాశాలలో మెరిసిన ముత్యాలు

ఫలితాల్లో సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో చదివే ఇద్దరు విద్యార్థినులు అత్యధిక మార్కులతో సత్తాచాటారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో కాదర్ల వైనిత ప్రియదర్శిని 470 మార్కులకుగానూ 468 మార్కులు సాధించింది. సెకండ్ ఇయర్ బైపీసీ చదువుతున్న ఇమా సదాఫ్ 1000 మార్కులకు 989 మార్కులు సాధించింది. సిద్దిపేటలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలోని మొదటి సంవత్సరం 91శాతం, సెకండ్ ఇయర్ 86 శాతం కాగా మొత్తంగా 90 శాతం ఉత్తీర్ణతశాతం నమోదైంది.

ఇంటర్‌లో 'సర్కార్' సత్తా
● మంచి మార్కులతో ఉత్తీర్ణత
7

సత్తాచాటిన విద్యార్థులు


తల్లిదండ్రులతో రాజశేఖర్‌రెడ్డి

నంగునూరు/చేర్యాల/గజ్వేల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. నంగునూరు మండలం తిమ్మాయిపల్లికి చెందిన రైతు దంపతులు చల్లారం నవిత, మల్లారెడ్డి కుమారుడైన చల్లారం రాజశేఖర్‌రెడ్డి ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 470 మార్కులకు గాను 468 మార్కులు పొంది రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. కరీంనగర్‌లోని ఎస్వీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. రాజశేఖర్‌రెడ్డి తల్లిదండ్రులు నవిత, మల్లారెడ్డి వ్యవసాయం చేస్తూ కూరగాయలు పండిస్తారు. ప్రతిరోజు కూరగాయలను సిద్దిపేటలోని రైతు మార్కెట్లో విక్రయిస్తూ కుమారుడిని కష్టపడి చదివించారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


తల్లిదండ్రులతో స్పందన

● నంగునూరు మండల కేంద్రానికి సందెబోయిన లక్ష్మి, సురేశ్ దంపతుల కుమార్తె స్పందన ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను 467 మార్కులు పొంది రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. స్పందన తల్లిదండ్రులు నంగునూరు చుట్టుపక్కల గ్రామాల్లో కూరగాయల అమ్ముతూ తమ పిల్లల్ని చదివిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో రెండోస్థానం సాధించిన స్పందనను గ్రామస్థులు అభినందించారు.

● ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలోని సంగుపల్లికి చెందిన మ్యాక అరవిందా ఎంపీసీ విభాగంలో 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. జహీరాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న అరవిందా ఆర్థికంగా ఇబ్బందిగా ఉన్నప్పటికీ ఇంటర్‌లో సత్తా చాటి అందరి మన్ననలు పొందారు. అరవిందా పరీక్షలు ముగియగానే సమయం వృథా చేయకుండా కంప్యూటర్ శిక్షణతోపాటు కుట్టుమిషన్ నేర్చుకుంటుంది. మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన కాసుల ప్రజ్వలిత ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 993 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం సాధించారు.

● ఇంటర్ ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో చేర్యాలకు చెందిన సాయిదీప్తి 995 మార్కులతో రాష్ట్ర ప్రథమ స్థానంలో నిలిచారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో పి.స్పందన రాష్ట్రస్థాయిలో ద్వితీయ, జిల్లా ప్రథమ, సీఈసీ విభాగంలో ఎల్.అక్షయ 489మార్కులతో రాష్ట్రస్థాయి ద్వితీయ, జిల్లా ప్రథమ స్థానం సాధించారు. ప్రథమ సంవత్సరంలో 95 శాతం, ద్వితీయ సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రత్యేకాధికారి కృష్ణవేణి తెలిపారు.

వేసవిలో ఆరోగ్యం పైలం
● మండుతున్న ఎండలు.. వాటితోపాటే వ్యాధుల ముప్పు..
● జాగ్రత్తలు పాటిస్తేనే మేలు
7

ధాన్యానికి బీ గ్రేడ్ ఇచ్చాడని.. కొనుగోలు కేంద్రం ఉద్యోగితో ఘర్షణ

● పెట్రోల్ పోసి నిప్పు అంటించే యత్నం
● రైతుపై కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు

నంగునూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు విషయంలో తలెత్తిన వివాదంలో ఓ రైతు కొనుగోలు కేంద్రం ఉద్యోగితో ఘర్షణ పడటమే కాకుండా అతనిపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. రాజగోపాలపేట ఎస్సై ఆసిఫ్ కథనం ప్రకారం.. నంగునూరు మండలం తిమ్మాయిపల్లిలో పాలమాకుల సహకార సంఘం ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి అదే గ్రామానికి చెందిన చల్లారం జగన్మోహన్ రెడ్డి ధాన్యాన్ని తీసుకువచ్చారు. వడ్ల రకం చిన్నగా ఉన్నందున కేంద్రం వద్ద ఉన్న ఉద్యోగి బీ గ్రేడ్ కేటాయించారు. దీంతో రైతు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి లక్ష్మణ్‌తో గొడవకు దిగాడు. పక్కనే ఉన్న సహకార సంఘం ఉద్యోగి అనగొని యాదగిరి ధాన్యం పరిశీలిస్తుండగా 'నా ధాన్యానికి బీ గ్రేడ్ ఇస్తావా?' అంటూ ఆగ్రహంతో దూషించాడు. అంతటితో ఆగకుండా తన ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ తీసి యాదగిరిపై చల్లి అగ్గిపెట్టెతో నిప్పు పెట్టే ప్రయత్నం చేశాడు. పక్కనే ఉన్న హమాలీలు అప్రమత్తమై రైతును అడ్డుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండుకు తరలించారు.

బస్సులు ఆపండి సార్లు

● కలెక్టరేట్ మహిళా ఉద్యోగుల ఆవేదన ● ప్రజావాణికి వచ్చే వారికీ తప్పని ఇబ్బందులు
● మహిళలు ఉంటే బస్సులు ఆపడం లేదని ఆరోపణ



సిద్దిపేటఅర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట కలెక్టరేట్.. పట్టణం నుంచి (హైదరాబాద్ రూట్‌లో) సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కార్యాలయానికి నిత్యం ఉద్యోగులు, అలాగే వివిధ సమస్యలపై సామాన్య ప్రజలు వస్తూ పోతుంటారు. అందరికీ సొంత వాహన సదుపాయం లేకపోవడంతో ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతుంటారు. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులతో పాటు ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణికి సిద్దిపేట, పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది కలెక్టరేట్ కార్యాలయానికి వస్తూ ఉంటారు. కార్యాలయం వద్దకు చేరుకోవడంలో ఇబ్బందులు తక్కువగా ఉన్నప్పటికీ కలెక్టరేట్ నుంచి సిద్దిపేటకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే సందర్భంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బస్సు కోసం ఎదురుచూపులు

ఫ్రీ బస్సు ప్రయాణం వల్లే..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉండడం వల్లే ఆర్టీసీ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు. చేయి ఎత్తినా కూడా చూసీచూడనట్లుగా డ్రైవర్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులను గుర్తుపెట్టుకుని మరీ బస్సు ఆపకుండా వెళ్లడం ఇబ్బందులు గురిచేస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. ఒక్కోసారి ప్రైవేటు వాహనాల్లో, ఆటోల్లో వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వారు చెబుతున్నారు.


బస్సులు ఆపకపోవడంతో ఆటోలో వెళుతున్న మహిళా ఉద్యోగులు

ప్రజావాణికి వచ్చే వారికి తప్పని ఇబ్బందులు

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా మొత్తంగా అనేక మంది ప్రజలు వస్తూ వెళ్తూ ఉంటారు. కార్యాలయానికి వచ్చిన సిబ్బంది బస్టాండ్ వెళ్లి అక్కడి నుంచి తమ మండలానికి ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

సిబ్బందికి అవగాహన కల్పిస్తాం

ప్రస్తుతానికి డిపో పరిధిలో అన్ని చోట్లా బస్సులను ఆపాలని సూచిస్తున్నాం. ఇంకా ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పిస్తాం. మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

- రఘు, సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్

అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గ్రామ సమీపంలో ఈనెల 17న రాత్రి వ్యవసాయ బావిలో శవమై కనిపించిన యువకుడు ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన సాయిప్రకాశ్(29)గా హన్మకొండ జిల్లా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. 15న సాయిప్రకాశ్ అదృశ్యమైనట్లు బంధువులు హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయిప్రకాశ్‌ను హన్మకొండలో హత్యచేసి హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డ వ్యవసాయ బావిలో పడివేసి వెళ్లి ఉంటారన్న కోణంలో అక్కడి పోలీసులు కేసు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. హుస్నాబాద్ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా భావించి రెండురోజుల క్రితమే శవాన్ని ఖననం చేసినట్లు తెలిపారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు బాసటగా ఎంఎస్ఎంఈ


విజయ సూచిక చూపుతున్న మహిళా పారిశ్రామికవేత్తలు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఈ బాసటగా నిలుస్తుందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డిలో వీ హబ్ ద్వారా జిల్లా ఎస్‌హెచ్‌జీ, మహిళా పారిశ్రామికవేత్తలకు మంగళవారం ఎంఎస్ఎంఈ ర్యాంప్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ నిధులతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలు, పరిశ్రమలకు సపోర్టు అందుతుందన్నారు. అనంతరం వీ హబ్ డైరెక్టర్ జాహిద్ అక్తర్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ మాట్లాడుతూ ఈ శిక్షణలో భాగంగా టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళలు లాంటి రంగాల్లోని వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యతపై శిక్షణ అందించి ప్రోడక్ట్ డెవలప్‌మెంట్, డైవర్సిఫికేషన్, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్, ఎక్స్‌పర్ట్ మెంటరింగ్ మద్దతు అందనుందని వివరించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

పుల్‌కల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం హున్నాపూర్ గ్రామానికి చెందిన వడ్డె రాఘవ(35)కు భార్య దుర్గమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గతేడాది దుర్గమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. భార్య మరణించిందన్న బెంగతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి మృతితో ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. మృతుడి మామ వడ్డె వెంకయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థయాత్రలకు వెళ్లి..

మిరుదొడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తీర్థయాత్రలకు వెళ్లిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉమ్మడి మిరుదొడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు ఐదురోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లారు. మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన మాల చిన్నబోయ రాజు(36) మహానందిలోని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారమందించారు.

ఈతవెళ్లి యువకుడు మృతి

మిరుదొడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఈతకు వెళ్లి చెరువులో పడి యువకుడు చనిపోయాడు. ఎస్ఐ గంగరాజు వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామానికి చెందిన తౌడబాబు(25) తన స్నేహితులతో కలిసి గ్రామంలోని పెద్దచెరువుకు ఈతకు వెళ్లారు. చెరువులో చాలా వరకు ఈత కొట్టుకుంటూ వెళ్లిన బాబు ప్రమాదవశాత్తు అందులో మునిగి చనిపోయాడు. మృతుడి తండ్రి ఎగోండ ఫిర్యాదు మేరకు కేసుఉ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శుభకార్యం కోసం వచ్చి.. అనంతలోకాలకు

చేర్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మనువడి శుభకార్యానికి వచ్చి తాత తనువు చాలించిన సంఘటన కొమురవెల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కొమురవెల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి కనకయ్య(50) కుటుంబంతో సహా చాన్నాళ్లక్రితం హైదరాబాదులో స్థిరపడ్డారు. అక్కడ పాత ఇనుము, సీసాల క్రయ విక్రయదుకాణంతో జీవిస్తున్నారు. తన పెద్ద కుమారుడికి ఇటీవల కుమారుడు జన్మించగా, కొండపాక మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని అత్తగారింటి వద్ద బారసాల నిర్వహించారు. ఇంటికి సమీపంలో ఉన్న బావిలో యువకులు ఈత కొడుతున్నారు. కనకయ్య కూడా ఈత కొడతానని దూకి మునిగి చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..


కనకయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని రంగంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. రంగంపేటకు చెందిన కిచ్చెంగారి కనకయ్య(36) మద్యం మత్తులో గ్రామంలోని పల్లె చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

ధాన్యం కుప్పలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కొండపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ శివారులో రైస్‌మిల్ వద్ద ధాన్యం కుప్పలను ఢీకొని ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని సిరసనగండ్ల గ్రామానికి చెందిన బాబు బైక్‌పై సిద్దిపేట నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలను ఢీకొని కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, రమేష్ చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

పొలం విషయంలో ఇరువురికి గొడవ

● పరస్పరం కత్తితో దాడి

వెల్దుర్తి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పొలం దారి విషయంలో ఇరువురి మధ్య గొడవ జరగ్గా.. ఒకరిపై మరో వ్యక్తి కత్తితో దాడిచేసిన ఘటన మండల పరిధిలోని ఎలుకపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కానికే జయరాములు అదే గ్రామానికి చెందిన కానికే రవికి పొలానికి వెళ్లే దారి విషయంలో సోమవారం రాత్రి గొడవ జరిగింది. రవి జయరాములును తిడుతూ కత్తితో దాడిచేశాడు. దీంతో జయరాములికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు కానికే జయరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు మూడు గేదెలు మృతి

గుమ్మడిదల/మిరుదొడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు రెండు గేదెలు మృతిచెందిన సంఘటన గుమ్మడిదల గ్రామంలో చోటుచేసుకుంది. గుమ్మడిదలకు చెందిన కోర్వత్తి కృష్ణకు రెండు గేదెలు ఉన్నాయి. కాగా మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపడడంతో అవి మృతిచెందాయి. ఈ విషయాన్ని పశు సంవర్థకశాఖ వైద్యాధికారి డాక్టర్ అరుణకు తెలపడంతో ఆమె ఘటనా స్థలానికి వచ్చి పంచనామా చేశారు. పిడుగుపడి పాడిగేదె మృతిచెందిన సంఘటన మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గూళ్లబాగులకు చెందిన పాడిగేదేను వ్యవసాయం పొలం వద్ద కట్టేశాడు. ఒక్కసారిగా పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె మృతితో రూ.60 వేల నష్టం వాటిల్లిందని కృష్ణ వాపోయాడు.

కాశీనాథ్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌తో సహా పలువురిపై కేసు

నారాయణఖేడ్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని చరిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయంలోకి అక్రమంగా ప్రవేశించి గోతిని తవ్వి ఆలయానికి నష్టం కలిగించిన మాజీ చైర్మన్ హన్మాండ్లుతో సహా మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆలయంలోని మండపం పక్కన ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గోతిని తవ్వించి తెలియకుండా గ్రిల్స్ ఉంచారు. సోమవారం ఆలయానికి వెళ్లిన భక్తులు గమనించి గుప్తనిధుల కోసం గోతిని తవ్వారని పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి సైతం ఆలయాన్ని సందర్శించి గోతిని తవ్విన విషయమై విచారణ జరపాలని పోలీసులకు సూచించారు. ఈ మేరకు దేవాదాయశాఖ ఈవో శివరుద్రప్ప సూచన మేరకు జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ చైర్మన్ హన్మాండ్లతో సహా పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఇంటర్‌లో 'సర్కార్' సత్తా



సాయి దీప్తి 995 ఎంపీహెచ్‌డబ్ల్యూ | మౌనిక 964 కంప్యూటర్‌సైన్సు | పూజా 957 బైపీసీ | సింధు 954 ఎంపీసీ | సంధ్య 952 కంప్యూటర్ సైన్సు | తేజస్విని 945 బైపీసీ | ఆనంద్ 943 కంప్యూటర్‌సైన్స్ | పద్మ 935 కంప్యూటర్‌సైన్సు



స్పందన 489 ఒకేషనల్ | అక్షయ 489 సీఈసీ | హేమలత 468 కంప్యూటర్‌సైన్సు | సింధుజ 468 ఎంపీసీ | నస్రఫాతిమా 468 ఎంపీసీ | కల్పవల్లి 468 ఎంపీసీ | ఇందు 449 సీఈసీ | అల్మాస్ 436 ఎంపీసీ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలలు ఇంటర్ పరీక్షా ఫలితాలలో తమ సత్తా చాటాయి. అనేక మంది విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూప్‌లలో మంచి ఫలితాలను సాధించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా మంచి మార్కులు పొందారు.

✦ పెద్దశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో జి. రాజేశ్వరి(964/1000), ప్రథమ సంవత్సరం సీఈసీలో విశాల్(431) మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు.

✦ రేగోడు: రేగోడు తెలంగాణ మోడల్ కళాశాలలో 97 ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. సెకండియర్ బైపీసీలో పూజ (957/1000) మార్కులు సాధించగా, ఎంపీసీలో సింధు (954/1000), వరలక్ష్మి 901/1000 మార్కులు సాధించారని తెలిపారు.

✦ మనూరు: మనూరు జూనియర్ కళాశాలలో 93.5 శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు కళాశాల పిన్సిపల్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

✦ వెల్దుర్తి: వెల్దుర్తిలోని శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 87శాతం, ద్వితీయ సంవత్సరంలో 82శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

✦ చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 65 శాతం, దిత్వీయ సంవత్సరంలో 80 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

✦ జగదేవ్‌పూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్‌లోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ముగ్గురు, ఎంఈసీలో ఒకరు మంచి మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఇద్దరు, సీఈసీలో ఒకరు సత్తాచాటారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ స్లీవరాజు, అధ్యాపక బృందం అభినందించారు.

✦ సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో మోడల్ కళాశాల మొదటి సంవత్సరం ఫలితాల్లో 35 మంది ఉత్తీర్ణ సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 86 మంది ఉత్తీర్ణత సాధించారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

✦ వర్గల్: వర్గల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 61.11 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 27.90 శాతం ఉత్తీర్ణత సాధించారు.

✦ చేర్యాల: ఇంటర్మీడియట్ ఫలితాలలో చేర్యాల కస్తూర్బా విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఇంటర్ ఒకేషనల్ ద్వితీయసంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యు విభాగంలో సాయిదీప్తి 995 మార్కులతో రాష్ట ప్రథమ ర్యాంకు సాధించింది. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో పి.స్పందన రాష్ట్రస్థాయి ద్వితీయ, జిల్లా ప్రథమ, సీఈసీ విభాగంలో ఎల్. అక్షయ 489 మార్కులతో రాష్ట్రస్థాయి ద్వితీయ, జిల్లా ప్రథమ ర్యాంకులు సాధించారు.

✦ ముస్త్యాల మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ముగ్గురు, ద్వితీయ సంవత్సరంలో ముగ్గురు టాపర్లుగా నిలిచారు. ప్రథమ సంవత్సరంలో 64 శాతం, ద్వితీయ సంవత్సరంలో 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జె.భిక్షం తెలిపారు.

✦ చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ప్రథమసంవత్సరంలో 34.37శాతం, ద్వితీయ సంవత్సరంలో 42శాతం ఉత్తీర్ణతసాధించారు.

✦ సాంఘీక, సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 76.60శాతం, ద్వితీయ సంవత్సరంలో 85.29 శాతం ఉత్తీర్ణత సాధించారు.

✦ చేగుంట: చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 65.38 శాతం ప్రథమ సంవత్సరం 35.14 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు 41 శాతం, ప్రథమ సంవత్సరం 31 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 51 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ప్రథమ సంవత్సరం 39శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరం 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరం 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని కళాశాలల ప్రిన్సిపాల్స్ కృష్ణారెడ్డి, చంద్రకళలు తెలిపారు.

✦ చిన్నకోడూరు: చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 74 శాతం, ద్వితీయ సంవత్సరంలో 76 శాతం, ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరంలో 53 శాతం, ద్వితీయలో 66 శాతం ఉత్తీర్ణత సాధించారు.

✦ కొండపాక: ఇంటర్ ఫలితాల్లో కొండపాక మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 90 శాతం , మొదటి సంవత్సరం విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ యజ్ఞశ్రీ తెలిపారు.

✦ ఐడీఏబొల్లారం: ఐడీఏబొల్లారం పట్టణంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ విభాగంలో ప్రథమలో వైష్ణవి 470 మార్కులకు 465, విఘ్నేష్ 461, రాధిక 455 మార్కులు సాధించారు. బైపీసీలో ఎండి ఆయేషా 437 మార్కులు వచ్చాయి. సీఈసీలో కాజల్‌కుమారి 481, ఎంఈసీ అజిత్‌కుమార్ 396 చొప్పున మార్కులు సాధించారు. ద్వితీయ ఏడాదిలో ఎంపీసీ విభాగంలో సమీర్‌ప్రసద్ 978, ప్రియాసింగ్ 977, ఎండి రుక్సార్ 976 , బైపీసీ విభాగంలో భవిత 976, సీఈసీలో బేగం 944, ఎంఈసీ లో ప్రసన్న 957 మార్కులు సాధించారు.

✦ జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో హోతి(కే) గురుకుల కళాశాలలో విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణతను సాధించారు.

✦ పాపన్నపేట: పాపన్నపేట జూనియర్ కళాశాల 72 శాతం ఉత్తీర్ణత సాధించింది. ప్రథమ సంవత్సరంలో 50 శాతం, ద్వితీయ సంవత్సరంలో 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న జగదేవ్‌పూర్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ స్లీవరాజు



కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

దేశాభివృద్ధిలో ఐఐటీ విద్యార్థులు కీలకం

కంది, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఐఐటీ విద్యార్థులు కీలకపాత్ర వహించాలని కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఐఐటీ డైరెక్టర్ బీఎస్‌మూర్తి ఆయనకు స్వాగతం పలికారు. నూతన పరిశోధనలు, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఐఐటీ నుంచి ప్రభుత్వరంగ అభివృద్ధికి తోడ్పాటు తదితర విషయాలను గవర్నర్‌కు బీఎస్ మూర్తి వివరించారు. ఐఐటీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్‌లో అత్యాధునిక పరిశోధనలు, స్టార్టప్ సహకారాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాల గురించి గవర్నర్‌కు వివరించారు. ముఖ్యంగా ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ ఫ్యూయల్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఐఐటీ చేస్తున్న పరిశోధనలపై ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్ భారతదేశ నిర్మాణంలో ఐఐటీ విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, ఆధునిక సాంకేతికత వినియోగంతో దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పటునందించాలని పేర్కొన్నారు.



కలెక్టర్, ఎమ్మెల్యేలకు కంటైనర్ క్లినిక్ పనితీరును వివరిస్తున్న సంస్థ యాజమాన్యం

కంటైనర్ క్లినిక్‌తో సత్వర వైద్య సేవలు

కంగ్టి/సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ క్లినిక్‌తో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సత్వర వైద్య సేవలందుతాయని కలెక్టర్ క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టిలో సహారా రూరల్ హెల్త్ సెంటర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన కంటైనర్ క్లినిక్, గ్రాంబులెన్స్‌లను వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన వారు నివసించే ప్రాంతమైన కంగ్టిలో కంటైనర్ క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సహారా, ఐఓసీఎల్ సేవలకు వారు ప్రశంసించారు. కార్యక్రమంలో సహారా సంస్థ డైరెక్టర్ మఠం శంకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతిమ, సభ్యులు రవీందర్ రాథోడ్, ఐఓసీఎల్ జీఎం కైలాస్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యం పైలం

మండుతున్న ఎండలు.. పొంచిఉన్న వ్యాధుల ముప్పు.. జాగ్రత్తలు పాటిస్తేనే మేలు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్‌లోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటుతుండటంతో ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. వేసవిలో కేవలం ఎండలు, ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తాం. కానీ, కేవలం ఎండ వేడి పెరగడమే కాదు అనేక రకాల వ్యాధులు, ఆరోగ్య సమస్యలు కూడా వస్తుంటాయి. ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్య, చర్మ సమస్యలు, కలరా, విరేచనాలు డీహైడ్రేషన్, వడదెబ్బ లాంటివి ఈ కాలంలో ఎక్కువగా వస్తుంటాయి. గుండెపోటు వంటి సమస్యలు కూడా ఎండాకాలంలో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది.





ఆస్తమాతో జాగ్రత్త...

ఎండాకాలంలో ఆస్తమా మరింత ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆస్తమాతో బాధపడే పిల్లలకు సమస్య ఎక్కువవుతుంది. వేసవిలో తేమశాతం ఎక్కువ ఉండడం వలన సూక్ష్మజీవులు, ఫంగస్ వంటివి ఎక్కువ అభివృద్ధి చెందుతాయి. ఎండాకాలంలో గాలిలో చేరే కాలుష్యం ఎక్కువ సేపు విస్తరిస్తూనే ఉంటుంది. ఈ కారణాలతో ఆస్తమా ఎక్కువయే అవకాశం ఉంది. అందుకే ఆస్తమా రోగులు వేసవి కాలంలో తమ వెంట ఆస్తమాకు వాడే ఔషధాలు తప్పకుండా ఉంచుకోవాలి. వీలైనంత వరకు దుమ్ము, ధూళి, కాలుష్యానికి దూరంగా ఉండాలి.



చర్మవ్యాధులు అధికం...

ఎండాకాలంలో వేడి ఎక్కువగా ఉండడంతో పాటు సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఎక్కువ సేపు ఎండలలో తిరిగితే చర్మం కమిలిపోతుంది. దీనినే సన్ బర్న్‌గా పిలుస్తారు. దీంతో చర్మం కమిలిపోతుంది. ఎర్రగా మారుతుంది. చిన్న చిన్న కురుపులు, పొక్కులు ఏర్పడి మంటగా ఉంటాయి. ఎండలలో చర్మం కమిలి పోకుండా ఉండేందుకు తెల్లని, పలుచటి వస్త్రాలు వేసుకోవాలి. ఎండలలో వెళ్లే ముందు సన్ స్క్రీన్ లోషన్‌లు రాసుకోవడం వలన ఫలితం ఉంటుంది.

ప్రాణాంతక మైనది హైపర్ థర్మియా...

అధిక వేడి కారణంగా శరీర ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతుంటాయి. దీంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీటన్నిటిని కలిపి హైపర్ థర్మియాగా పిలుస్తారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, పెద్ద వయసుగల వారు దీని బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. సాధారణంగా మన దేహంలో అంతర్గతంగా ఉష్ణాన్ని నియంత్రించే వ్యవస్థలు ఉంటాయి. చర్మం, శ్వాసప్రక్రియ ద్వారా శరీరంలోని అధిక వేడి బయటకు వెళుతుంది. కానీ ఎండలు బాగా పెరిగిపోయినప్పుడు శరీరం అధిక వేడిమిని తట్టుకోలేక, హైపర్ థర్మియా సమస్య మొదలవుతుంది. వడ దెబ్బ తగలడం, నీరసం, వికారం, వాంతులు, విరేచనాలు, తల తిరగడం, కండరాలలో వణుకు, పట్టు సడలిపోవడం, మతిస్థిమితం కోల్పోవడం, శ్వాస వేగం, గుండె కొట్టుకొనే వేగం పెరిగిపోవడం, తలనొప్పి వంటివి వస్తాయి. చివరకు కోమాలోకి వెళతారు. ఈ పరిస్థితి చాల ప్రమాదకరం. కొద్దీ సమయం ఆలస్యం చేస్తే మరణించే అవకాశం కూడా ఉంటుంది.

వేడి జలుబు...

శీతకాలంలో లాగానే వేసవి కాలంలోనూ తీవ్రమైన జలుబు చేసే అవకాశం ఉంటుంది. వేసవిలో రైనో, కరోనా, పర ఇన్ ఫ్లూయెంజాలాంటి రకరకాల వైరస్‌లు వస్తుంటాయి. చలికాలంలో సంక్రమించే వైరస్‌ల కన్నా ఇవి మరింత ప్రభావంతంగా ఉంటాయి. వీటి వల్ల జలుబు కాకుండా శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. డయేరియా, తలనొప్పి, ఎడతెగని దగ్గు వస్తాయి. మందులు వాడిన ఎక్కువ రోజులు ఇలానే ఉండే అవకాశం ఉంటుంది. దీంతో పాటు గొంతు నొప్పి, ముక్కులోని శ్లేష్మం మంటగా ఉంటుంది.

కిడ్నీలో రాళ్లు..

మూత్రనాళల ఇన్ఫెక్షన్లు..

ఎండాకాలంలో మూత్ర నాళ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. అంతే కాదు కిడ్నీలో రాళ్ల ఏర్పడడానికి వేసవి పరిస్థితులు కారణమవుతాయి. ముఖ్యంగా మహిళలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. వేసవిలో శరీరానికి ఎక్కువ నీరు అవసరం. శరీరం ఉష్ణోగ్రతను అదుపులో ఉంచుకోవడానికి చెమటను బయటకు ఎక్కువ స్రవించడం. శరీరంలో డిహైడ్రతోన్ పరిస్థితి వస్తుంది. దీంతో మూత్ర పిండాలలో వడపోత సరిగా లేక రాళ్ల ఏర్పడుతాయి. దీంతో మూత్రనాళ సమస్యలు వస్తాయి. అందువలన వేసవిలో దాహం వేసిన వేయకపోయిన తరచూ నీరు తాగడం మంచిది.

వడదెబ్బ బారిన పడొద్దు..

కొండపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బయటికి వెళ్తే వడదెబ్బ ప్రమాదం పొంచి ఉంటుంది. జాగ్రత్తలు తీసుకుంటే ఎండాకాలంలో వడదెబ్బ నుంచి బయట పడవచ్చు. ఎండలు ఎక్కువైనప్పుడు తీవ్ర వడగాల్పులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వడదెబ్బ లేదా ఎండదెబ్బ అంటే పరిసరాల్లో ఎక్కువ ఉష్ణోగ్రత వల్ల శరీరంలోని వేడిని నియంత్రించే విధానం లోపించడం, సరైన మోతాదులో ద్రవపదార్థాలని తీసుకోకుండా, అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రతలు, శరీరం యొక్క ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తాయి. వడదెబ్బ బారిన పడిన వ్యక్తికి తీవ్రమైన తలనొప్పి వస్తుంది. నాడి వేగంగా కొట్టుకుంటుంది. నాలుక తడి ఆరిపోయి ఎండిపోతుంది. శరీరంలో కనీస నీటి శాతం తగ్గిపోవడం మనిషి పాక్షిక లేదా పూర్తిగా అపస్మారక స్థితికి చేరడం, శరీరంలో నిస్సత్తువ గుండెలో దడ, దమ్ము నీరసం చెమట పట్టడం శరీరం వేడి కడగడం ఏర్పడతాయి. వడదెబ్బకు గురైన వారిని వెంటనే నీడకు తీసుకెళ్ళాలి సదరు వ్యక్తి శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్ళ, గ్లూకోజ్ లేదా ఓఆర్ఎస్ కల్పిన నీటిని తాగించాలి. తగినంత గాలి ఆడేటట్లు చేయాలి.

ఎండాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..



రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో అత్యవసర పని ఉంటేనే బయటకు వెళ్లాలి. బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా మంచినీళ్ల బాటిల్ దగ్గర ఉంచుకోవాలి. రోజూ మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు అవసరం ఉంటేనే బయటకు వెళ్లాలి. తప్పనిసరిగా విధులు నిర్వహించే వారు మాత్రం మధ్యలో నీరు, ఓ ఆర్ ఎస్ తాగాలి. కీరదోస మజ్జిగ, పుచ్చకాయ లాంటివి తీసుకోవాలి. వడదెబ్బకు గురైన వారిని వెంటనే చల్లని వాతావరణానికి తీసుకువెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తడి గుడ్డ ఐస్ ముక్కలతో తగ్గించాలి.

- డాక్టర్ శ్రీధర్, కొండపాక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్

ఎండల్లో ఆరోగ్యం జాగ్రత్త



వేసవిలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దేహంలో నీటి శాతం తగ్గి డిహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. దీని వలన బీపీ, పొటాషియం తగ్గుతాయి. కొన్ని సార్లు స్పృహ తప్పి పడిపోయే అవకాశం ఉంటుంది. ఎండల్లో ఎక్కువగా తిరగడం వలన చర్మ సమస్యలు కూడా వస్తాయి. చల్లని పానీయాలు, నాసిరకంగా ఉన్న ఐస్ క్రీంలు తీసుకోవడం గొంతు సమస్యలు వస్తాయి. బయటకు వెళ్ళినప్పుడు తప్పకుంత తలపై తెల్లటి రుమాలు తలకు చుట్టుకోవాలి. కండ్లకు చలువ అద్దాలు తొడుక్కోవడం మంచిది. తరచూ నీటిని తాగండి. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే దగ్గరలోని ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలి. అన్ని ఆసుపత్రులలో ఓఆర్ఎస్, మందులు అందుబాటులో ఉన్నాయి.

డాక్టర్ శ్రీరాం, మెదక్ జిల్లావైద్యాధికారి

అండ లేదు.. నీడ లేదు

వదిలేసి వెళ్లిన తల్లి

- తిరిగిరాని లోకాలకు తండ్రి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- ప్రభుత్వ హాస్టళ్లలో చదువులు
- సెలవుల్లో ఎక్కడికి వెళ్లాలనే దైన్యం
- సాయం కోసం ఎదురుచూపులు

పాపన్నపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లి వదిలేసి వెళ్లిపోయింది. తండ్రిని అనారోగ్యం కాటేసింది. ఆడి పాడే వయస్సులో ఆలనాపాలనా చూసే వారు లేక ఆ చిన్నారులు దిక్కుతోచకన్నారు. నా అన్నవారు ఉన్నా- సహాయం చేయని పరిస్థితి. చిన్న వయస్సులోనే పెద్ద కష్టం ఎదుర్కొంటున్న వారిప్పుడు ఆదుకునే ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన భూతిపురం రవి, సంపూర్ణలకు ఇద్దరు కుమార్తెలు లావణ్య, అనురాధలతో పాటు ఓ కుమారుడు నవీన్ ఉన్నారు. భార్యాభర్తలు కాయాకష్టం చేసుకుంటూ అన్యోన్యంగా ఉంటున్న సమయంలోనే ఏమైందేమో గానీ నవీన్ పుట్టిన ఏడాదికే తల్లి పిల్లలను ఎటో వెళ్లిపోయింది. దీంతో చిన్నారుల ఆలనా పాలన తండ్రిపై పడింది. విధి వంచితులైన ఆ చిన్నారులకు ఆరు నెలల క్రితం తండ్రిని కూడా దూరం చేసింది. ఈ క్రమంలో ఆర్థికంగా లేకున్నా పెద్ద మనసుతో మేనత్త లక్ష్మి పిల్లలను చేరదీసి ఆశ్రమ పాఠశాలలో చేర్పించింది. టేక్మాల్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో లావణ్య ఎనిమిదవ తరగతి, అనురాధ ఏడవ తరగతి చదువుతున్నారు. నవీన్ కొత్తపల్లి బీసీ వసతి గృహంలో మూడో తరగతి చదువుతున్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నా- విద్యాసంవత్సరం ముగింపునకు రావడంతో ఆ చిన్నారులు వేసవి సెలవుల్లో ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితుల్లో పడిపోయారు. సెలవులు వస్తే సొంత గ్రామంలో తలదాచుకోవడానికి ఇల్లు లేదు. గతంలో సెలవులు వస్తే తండ్రి వద్దకు వచ్చేవారు. తండ్రి ఉన్నప్పుడు నివసించిన గుడిసె శిథిలావస్థకు చేరి, కనీసం తలదాచుకునే పరిస్థితి లేదు. మేనత్త బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ బతుకుతోంది. ఆమె దగ్గరకు వెళ్లి ఉండే పరిస్థితి లేదు. ఆమె కూలి పనులు వదులుకుని పిల్లల కోసం గ్రామానికి వచ్చి ఉండే పరిస్థితి లేదు. దీంతో పిల్లల బాధ్యతను చూసుకునేది ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సహాయం చేసే చేతుల కోసం ఎదురుచూపులు...

తల్లిదండ్రులు లేని తమను ఆదుకునేందుకు మనసున్న మహారాజులు ముందుకు రాకపోతారా అని ఆ చిన్నారులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కూడా అనాథ చిన్నారులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు తోడ్పాటు అందించడానికి దాతలు ముందుకు వస్తే పై చదువులు చదువుతామంటూ వారు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



శిథిలమైన గుడిసె ఎదుట చిన్నారులు

జిన్నారంలో ఉద్రిక్తత



జిన్నారం, ఏప్రిల్, 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శివుడి మట్టి విగ్రహం ధ్వంసం చేసిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనకు స్థానిక మదర్సాలో చదివే విద్యార్థులే కారణమని హిందువాదులు మదర్సా ఎదుట ధర్నా చేయటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. జిన్నారం శివారులో నిర్మాణంలో ఉన్న శివాలయం గుట్ట వద్ద బండరాయిపై ఏర్పాటు చేసిన శివుడి మట్టి విగ్రహం మంగళవారం సాయంత్రం ధ్వంసం అయినది. అదే సమయంలో అక్కడ ఉన్న స్థానిక మదర్సా విద్యార్థులను స్థానికులు నిలదీశారు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందల సంఖ్యలో హిందూవాదులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ ఘటనకు మదర్సా విద్యార్థులే కారణమని ఆరోపిస్తూ మదర్సా ఎదుట ధర్నా నిర్వహించారు. మదర్సాపై దాడికి యత్నించారు. ఈ ఘటనలో అక్కడ ఉన్న సీసీ కెమెరాలు, గేటు ధ్వంసం అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు నయీమోద్దీన్, వినాయక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లాలునాయక్‌లు భారీ సంఖ్యలో పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని ఘటనా స్థలం నుంచి పంపించి వేశారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించి వివరాలు సేకరించారు.

అలంకార ప్రాయంగా సులభ్ కాంప్లెక్స్‌లు

- హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.22 లక్షలతో నిర్మాణం
- ఒప్పందం రెన్యూవల్‌పై అధికారుల నిర్లక్ష్యం
- నిర్వహణ లేక తాళాలు
- స్వచ్ఛసర్వేక్షణ్‌లో అవార్డులందుకున్న చోటే పారిశుధ్యలోపమేంటని స్థానికుల మండిపాటు

హుస్నాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మూడు జాతీయస్థాయి, రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సులభ్ కాంప్లెక్స్‌లు నేడు అలంకార ప్రాయంగా మారడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్‌లోని శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యంతో రూ. లక్షలాది వెచ్చించి నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌లు నిరూపయోగంగా ఉంటున్నాయి.

ఏడాదిన్నర క్రితం నిర్మాణాలు

స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఏడాదిన్నర క్రితం నాలుగు చోట్ల సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, అనభేరి చౌరస్తా వద్ద రూ.4 లక్షల చొప్పున రెండు మినీ సులభ్ గదులు, రామవరం రోడ్డు అంగడి వద్ద, రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో రూ. 7 లక్షల చొప్పున సులభ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. వాటి నిర్వహణ కోసం పట్టణంలోని ఓ స్వశక్తి సంఘానికి అప్పగించారు. ఒక సీటుకు రూ. 2500 చొప్పున అసుపత్రి, అనభేరి చౌరస్తా, రామవరం అంగడి వద్ద మొత్తం 9 సీట్లకు రూ. 22,500 స్వశక్తి సంఘానికి చెల్లించినట్లు సమాచారం. అయితే 2 నెలల క్రితమే వాటి నిర్వహణ కాలపరిమితి ముగియడంతో వాటిని పట్టించుకునేవారు కరువయ్యారు. వాటికి తాళాలు వేసి ఉంటున్నాయి. వాటి మెయింటినెన్స్ కోసం మళ్లీ రెన్యూవల్ చేయాల్సి ఉండగా అధికారులు తమ కేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. అంగడి వద్ద మాత్రం మున్సిపల్ పారిశుధ్య కార్మికుడిని పెట్టి నిర్వహిస్తున్నారు. ఇక్కడి సులభ్ కాంప్లెక్స్ అక్కరకు రాకుండా తయారైంది.




హుస్నాబాద్ ఆసుపత్రి వద్ద నిరుపయోగంగా సులభ్‌కాంప్లెక్స్, జనవాసాల మధ్య పందుల సంచారం

దానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా వీటి నిర్వహణ చేసేందుకు రెన్యూవల్ చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. సులభ్ కాంప్లెక్స్‌లు అందుబాటులో లేకపోవడంతో పట్టణంలో పారిశుధ్యం దెబ్బతింటున్నదని స్థానికులు వాపోతున్నారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం పరిస్థితి దయనీయంగా తయారైందని పలువురు మండిపడుతున్నారు. దీంతో కోతులు, కుక్కలు, పందుల బెడద పెరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్‌కు సంబంధించిన అధికారి ఈ విషయంలో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్వహణ ఎవరిదో?

పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ నిర్వాహణ మీదంటే మీదేనని ఇటు మున్సిపల్ అధికారులు, అటు ఆలయ శాఖ అధికారులు దీనిని పట్టించుకోవడం లేదు. ఆలయానికి వేలాది మంది వస్తుంటారని, భక్తులకు ఉపయోగపడుతున్న దృష్ట్యా దాని నిర్వహణ బాధ్యత ఆలయ అధికారులే తీసుకోవాలని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. మీరంటే మీరని ఎవరూ పట్టించుకోకపోవడంతో సులభ్ కాంప్లెక్స్‌లు వినియోగంలో లేక తాళాలు వేసి ఉంటున్నాయి. నిత్యం వేలాది మంది పలు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం వీటిని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.



ఎల్లమ్మ ఆలయం వద్ద తాళం వేసి ఉన్న దృశ్యం

భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేట కల్చరల్/ హుస్నాబాద్ టౌన్/చేర్యాల/మద్దూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జీవకోటికి ఆధారమైన భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని పర్యావరణ ప్రేమికులు, వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భూ సంరక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నా అస్తిత్వానికి కారణమైన నీకు (ధరిత్రి) సర్వదా కృతజ్ఞతతో ఉంటానని పేర్కొంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.సునీత, వైస్ ప్రిన్సిపాల్ డా. అయోధ్య రెడ్డి, సీహెచ్ మధుసూదన్, డాక్టర్ రాణి, మధుసూదన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధరిత్రి దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి మాట్లాడారు. చెట్లను పెంచి భూమి, నీరు, గాలి లాంటి సహజ వనరులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను డీపీవో దేవకీదేవీ డీఎల్పీవో మల్లికార్జున్, ఎంపీడీవో వర్మ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కలిసి సేకరించారు. ఆలయ రాజగోపుర ఆవరణలో పోసి ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను ప్రజలు, భక్తులకు వివరించారు. చెత్త,చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పారబోయవద్దని సూచించారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు




దూళిమిట్ట మండలంలోని జాలపల్లి, జగదేవ్‌పూర్‌లలో రాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న అధికారులు

దూళిమిట్ట/జగదేవ్‌పూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం, వడగళ్ల ధాటికి జరిగిన పంటనష్టాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. దూళిమిట్టతో పాటు జాలపల్లి, తోర్నాల, బెక్కల్ గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను, మామిడి తోటలను తహసీల్దార్ మధుసూదన్, మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్ రైతులతో కలిసి పరిశీలించారు. ప్రాథమికంగా దాదాపు నాలుగు గ్రామాల్లో కలిసి 125 ఎకరాల్లో వరి పంట, 33 ఏకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గిరికొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కళ్యాణికమలాకర్,మాజీ సర్పంచ్ వరలక్ష్మీసాగర్ తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని జగదేవ్‌పూర్, పీర్లపల్లి, ధర్మారం, ఇటిక్యాల, అలీరాజ్‌పేట్, గొల్లపల్లి, దౌలాపూర్, కొండాపూర్, మాందాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారి వసంతరావు, ఉద్యానవన శాఖ అధికారి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొక్కజొన్న 180 ఎకరాలు, మామిడి 105 ఎకరాలు, కూరగాయలు 5 ఎకరాలు.. మొత్తం 1,585 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఖలీల్, సమత, భానుప్రకాష్, కవిత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హిందూ ఆలయానికి ముస్లిం యువకుడి విరాళం



పురోహితుడికి నగదును అందజేస్తున్న ముస్లిం యువకుడు

మర్కుక్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆలయ పునర్నిర్మాణానికి ఓ ముస్లిం యువకుడు విరాళాన్ని అందజేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మర్కుక్ మండలంలోని వరదరాజస్వామి ఆలయాన్ని దాతల సహాయంతో పునర్నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ నివాసి ముస్లిం యువకుడు అజీజ్‌పాషా తన వంతుగా ఆలయ పునర్నిర్మాణానికి 11,111 వేల రూపాయలు విరాళాన్ని అందజేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు. విరాళం డబ్బును మంగళవారం ఆలయ అర్చకులకు స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అజీజ్ పాషను అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, అర్చకులు వేణుగోపాల్‌చారి, పురుషోత్తమచారి, నాయకులు లక్కాకుల నరేష్, తుమ్మ కృష్ణ, అంతని నర్సింలు, శ్రీశైలం, బిక్షపతి, నరేష్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలను, పక్షులను కాపాడుదాం



మట్టి పాత్రలు ఏర్పాటు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ (ఎస్ఎఫ్ఎడి) సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సకోర అభ్యాన్ పేరుతో మూగజీవాలు, పక్షుల దాహం తీర్చేందుకు చెట్లకు మంచి నీటితో కూడిన మట్టి పాత్రలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగర స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ కన్వీనర్ ఝాన్సీ మాట్లాడుతూ ఏబీవీపీ విద్యారంగ సమస్యలపై పోరాటంతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సకోర అభ్యాన్ పేరుతో విద్యార్థులతో కలిసి పక్షులకు నీరందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ వైష్ణవి, జిల్లా కన్వీనర్ ప్రణయ్ కుమార్, ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్య, సిద్దిపేట మెదక్ జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణిందర్, నగర కార్యదర్శి పరశురాం, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం 'భూభారతి'



ఐవోసీ కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్

మిరుదొడ్డి,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): భూసమస్యలకు శాశ్వత పరిష్కారం భూభారతిచట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తుందని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం దుబ్బాక ఇంటిగ్రేటెడ్ కార్యాలయంలో, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆర్డీవో సదానందం ఆధ్వర్యంలో వేర్వేరుగా భూభారతి చట్టం 2025 పై రైతులకు, మాజీ ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు., ప్రస్తుతం ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా తహసీల్దార్, ఆర్డీవో. కలెక్టర్ వద్దనే భూసమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. భూభారతి చట్టంలోని వివిధ అంశాలపై రైతులకు, ప్రజలకు వివరించారు. భూభారతి చట్టంలో ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సంజీవ్‌కుమార్, మల్లికార్జున్, ఎంపీడీఓలు భాస్కర్‌శర్మ, వివిధ శాఖలఅధికారులు తదితరులున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

హుస్నాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణం 4వ వార్డులోని ఓ ఇంటిలో మంగళవారం రాత్రి పేకాడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. వారి నుంచి రూ. 30 వేలతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పలుచోట్ల వేసవి శిక్షణ శిబిరాలు

చిన్నకోడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం పేర్కొన్నారు. మండలంలోని రామంచ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సాఫ్ట్ బాల్ క్రీడలో ప్రగతి సాధించాలని కోరారు.

● చేర్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల దృష్ట్యా కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఎంపీయూపీఎస్‌లో ఈ నెల 24 నుంచి మే4వ తేదీవరకు ఉచిత శిక్షణాశిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈవో రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేతిరాత, చిత్రలేఖనం, రంగవల్లి, ఎన్‌సీసీ, కరాటే, కనీస గణిత సామర్థ్యాలు, స్పోకెన్ ఇంగ్లిష్, కవిత్వం, దేశభక్తి, యోగా, జీవన నైపుణ్యాలు తదితరఅంశాల పట్ల శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

గ్రంథాలయ పాఠ్యపుస్తకాల అందజేత

మిరుదొడ్డి,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో రూమ్‌టూ రీడ్ సంస్థ కోఆర్డినేటర్ మధూకర్‌రెడ్డి మంగళవారం గ్రంథాలయంలోని 1600 వివిధ పాఠ్యపుస్తకాలను అందజేశారు.

ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా భాస్కరశర్మ

మిరుదొడ్డి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దుబ్బాక ఎంపీడీవో భాస్కరశర్మను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, సిబ్బంది భాస్కరశర్మను శాలువాతో సన్మానించారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం

గజ్వేల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఆజాద్ డిఫెన్స్ అకాడమీలో ఉచిత కోచింగ్ తీసుకున్న వరుణ్ ఆర్మీకి ఎంపికవడం పట్ల ఏసీపీ కె. పురుషోత్తంరెడ్డి అభినందించారు. ఈ మేరకు మంగళవారం వరుణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో వసతులు ఏర్పాటు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సంస్థ మండలంలోని వివిధ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసింది. మంగళవారం హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సంస్థ ప్రతినిధులు కుకునూరుపల్లి చిన్నకృష్ణాపూర్ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి ట్యాంక్, కుళాయిలు, మరుగుదొడ్లు, ఇతర వసతులను పాఠశాలలో ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

● ప్రభుత్వ పాఠశాలల వార్షికోత్సవాల్లో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



జగదేవ్‌పూర్: ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో వేడుకలు

జగదేవ్‌పూర్/మద్దూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం విద్యార్థులకు అనేక వసతులు కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను డీఈవో చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకలలో విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● మిరుదొడ్డి/చిన్నకోడూరు/చేర్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచిఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం రాత్రి అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల నృత్యప్రదర్శన ఆహూతులను అలరించాయి. చిన్నకోడూరు మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లులకు పాద పూజ చేశారు. అంతకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రుల సైతం భాగస్వాములయ్యారు. చేర్యాల మండలం ముస్త్యాల మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ జె.భిక్షం ఆధ్వర్యంలో వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

రాంసాగర్‌లో ఘనంగా సీతారాముల కల్యాణం



వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య సీతారాముల కల్యాణోత్సవం

రాయపోల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో రామాలయం వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. రాములవారి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, బాజాభజంత్రిల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. సీతారాముల కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రథోత్సవం నిర్వహించడం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గ్రామాల్లో ముందస్తు బడిబాట



దౌల్తాబాద్: దొమ్మాటలో బడిబయట పిల్లలతో హెచ్ఎం బాసిత్

దౌల్తాబాద్/నంగునూరు/చేర్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో ముందస్తు బడిబాట కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలను కల్పిస్తున్నట్టు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దౌల్తాబాద్ మండలంలోని మంగళవారం ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాల దొమ్మాట ఆవాస ప్రాంతంలోని దొమ్మాట, గాజులపల్లి, సూరంపల్లి గ్రామాలకు చెందిన ప్రాథమిక పాఠశాలలు, శ్రీసాయి విద్యాలయం దొమ్మాట, చతుర్వేది టాలెంట్ విద్యాలయం సూరంపల్లి పాఠశాలలను దొమ్మాట జడ్పీ పాఠశాల హెచ్.ఎం.బాసిత్ పలువురు ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దొమ్మాట జడ్పీఉన్నత పాఠశాలలో వినూత్న రీతిలో బోధనాభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తద్వారా విద్యార్థుల్లో సమగ్ర అభ్యసన సామర్థ్యాలను పెంపొదిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పరంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం బడిబాట ర్యాలీలో నిర్వహించారు. రాంపూర్ గ్రామంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే ఖాతా, కొండంరాజు పల్లి, గట్లమల్యాల గ్రామాలలో ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

గజ్వేల్/మిరుదొడ్డి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపం తలెత్తకుండా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు సమన్వయంతో పని చేయాలని ఎంహెచ్ఎన్(మాతా, శిశు సంరక్షణ) జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఆనంద్ సూచించారు. పోషణ్ పక్వాడ-2025లో భాగంగా మంగళవారం గజ్వేల్ ప్రాజెక్ట్‌స్థాయి కార్యక్రమాన్ని గజ్వేల్ ఐవోసీలో నిర్వహించగా, గజ్వేల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలు, పిల్లల్లో పోషకాహార లోపాన్ని సరిచేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గజ్వేల్ సీడీపీవో సరిత మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఒక్కరోజు సంపూర్ణ భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు. దుబ్బాకలోని అంగన్‌వాడీ 2లో, మిరుదొడ్డి మండలం అందె అంగన్‌వాడీ కేంద్రాల్లో వేర్వేరుగా పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు ప్రీస్కూల్ మెటీరియల్ ప్రదర్శిస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక, మిరుదొడ్డి సెక్టారు సూపర్‌వైజర్లు చంద్రకళ, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు దీనమ్మ, శిరీష, రేణుక, జయలక్ష్మి, అనురాధ, రమా, జమున, కవిత ఉన్నారు.

జీపీ భవనానికి స్థల విరాళం



స్థల విరాళం పత్రాన్ని అందజేస్తున్న నర్సయ్య

వంద్నారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాయంపల్లి గ్రామానికి చెందిన జిందం నర్సయ్య నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 134 గజాల స్థలాన్ని విరాళంగా అందించి దాతృత్వం చాటుకున్నారు. ఈ మేరకు మంగళవారం లిఖిత పూర్వకంగా రాసిన కాగితాన్ని గ్రామ పంచాయతీ సెక్రటరీ భాస్కర్‌కు అందించారు. అనంతరం సెక్రటరీ భాస్కర్ స్థల విరాళాన్ని అందించిన నర్సయ్యను గ్రామస్థులందరి పక్షాన అభినందించారు.

అట్టడుగులో..

(5వ పేజీ తరువాయి)

పాసవ్వగా, బాలికలు 68.31 శాతం పాసయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లోనూ ఇంచుమించు ఇదే విధంగా బాలరు, బాలికల మధ్య ఉత్తీర్ణత శాతం ఉంది. పదో తరగతిలో ఇరువురి నడుమ సమానంగా ఉంటున్న ఉత్తీర్ణత శాతం ఇంటర్‌లో మాత్రం బాలురకు నిరాశజనక ఫలితాలు ఎదురవుతున్నాయి. ఈ దిశగా అధికారులు, కళాశాలల నిర్వాహకులు దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లోపం ఎక్కడా..!

ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. కానీ సిద్దిపేట జిల్లా విద్యార్థులు 60 శాతం ఉత్తీర్ణతను దాటలేకపోయారు. ప్రైవేట్ కళాశాలల సంగతి పక్కనబెడితే జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గినట్లుగా తెలుస్తున్నది. అన్ని వసతులతోపాటు సరిపడా అధ్యాపకులు ఉన్నప్పటికీ ఫలితాలు ఈ విధంగా ఎందుకు వచ్చాయో పరిశీలన చేయాల్సిన అవసరం లేకపోలేదు. పదో తరగతి పరీక్షలపై జిల్లా విద్యాధికారులు, అధికార యంత్రాంగం దృష్టి పెట్టినట్లుగా ఇంటర్ విద్యార్థులను పర్యవేక్షించకపోవడమే కారణమా అని సమీక్షించుకోవాల్సి ఉంది. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు కీలకమైన ఇంటర్‌లో ఫెయిల్ కావడంపై కారణాలను అన్వేషించాల్సి ఉంది.

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదు పెరగాలి

దౌల్తాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులందరూ బోధనకు సిద్ధంగా ఉండాలని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అన్నారు. మంగళవారం మండల వనరుల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో గజ్జల కనకరాజు మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో ప్రతీ పాఠశాలలో విద్యార్థుల హాజరు నమోదు పెరగాలని ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అఫ్జల్, హుస్సేన్, గోపాల్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాసిత్, ముత్యం రెడ్డి ,మండల వనరుల కేంద్రం సిబ్బంది శేఖర్, పెంటయ్య, రాజు ,నగేష్ కుమార్ ,మల్లేశం పాల్గొన్నారు.

సంక్షేమాన్ని మరచిన కాంగ్రెస్ ప్రభుత్వం: బీఆర్ఎస్

ములుగు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ములుగులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో పేదలకు సాగునీరు, తాగునీరు అందించి ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేన్నారు. ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ములుగు మండలం నుంచి పెద్దఎత్తున జనాన్ని తరలించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జుబేర్, అంజన్‌గౌడ్, నరేష్‌గౌడ్, అర్జున్‌గౌడ్, గణేష్‌గుప్త, లింగారెడ్డి, మురళీధర్‌రెడ్డి, హరిబాబు, గణేష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ పెట్టుబడిదారులకు పరిశ్రమలను తాకట్టు పెడుతున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే దేశవ్యాప్త సమ్మెను అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 22: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని 7వ వార్డులో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజులతో కలిసి యూజీడీ వ్యవస్థను సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు ప్రారంభించారు. అనంతరం 8వ వార్డులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పనులను పరిశీలించారు. వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, ఏఈ పృథ్వి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలి

గజ్వేల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం డాక్టర్లకు, నర్సులకు, సిబ్బందికి మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, డయల్-100 ప్రాముఖ్యత, షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాల గూర్చి అవగాహన కల్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, వైద్యులు మంజుల, షీ టీమ్ బృందం సభ్యులు ఉన్నారు.